క్లుప్తంగా

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న దృశ్యం

కంచిలి: మండలంలోని మండపల్లి, తలతంపర, బూరగాం పంచాయతీల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరెడ్డి బుధవారం ఇంటర్వ్యూలు చేపట్టారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ ప్రక్రియ చేపట్టారు. మూడు పంచాయతీల్లో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 3 పోస్టులు ఖాళీ ఏర్పడడంతో, వాటికి ఇంటర్వ్యూ చేశామన్నారు.

సూక్ష్మ కళాకారుడికి సత్కారం



రమేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 21వ వార్డు గాంధీనగర్‌లో నివాసముంటున్న సూక్ష్మ కళాకారుడు కొత్తపల్లి రమేష్ ఆచారిని ది విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ పలాస బ్రాంచ్ వారు బుధవారం సత్కరించారు. అద్భుతమైన సూక్ష్మ కళాఖండాలతో ప్రశంసలు అందుకుంటున్న రమేష్‌కి అభినందనలు తెలియజేశారు. భవిష్యత్‌లో మరిన్ని కళాఖండాలు సృష్టించాలని ఆకాంక్షించారు.

బారువ ఎస్‌ఐగా చిరంజీవి



సోంపేట: మండలంలోని బారువ పోలీసుస్టేషన్ ఎస్‌ఐగా ఎస్.చిరంజీవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన సత్యనారాయణ బదిలీపై పోలాకి వెళ్లారు. దీంతో కంచిలి ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్.చిరంజీవి ఇక్కడ విధుల్లో చేరారు. ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

మంచినీటి ట్యాంకులు ప్రారంభం

సోంపేట: పట్టణంలోని మంగళవీధి, గాంధీనగర్ వీధుల్లో సోంపేట మేజర్ పంచాయతీ, సోంపేట రోటరీ క్లబ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన మినీ వాటర్ ట్యాంకులను ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటి సమస్యల పరిష్కారానికి రోటరీ క్లబ్ సాయం అందించడం అభినందనీయమన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నగిరి ప్రభావతి, ఉప సర్పంచ్ మల్లా వెంకటరమణ, రోటరీ క్లబ్ ప్రతినిధులు యుగంధర్, మల్లా తిరుమలరావు, నగిరి శరత్, నెహ్రూ, గంగాధర్, రవి పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశం నేడు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని సీపీఎం కార్యాలయంలో జీడికి మద్దతు ధర కల్పించాలని కోరుతూ వామపక్షాల సమక్షంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జీడి రైతులు, సామాజికవేత్తలు, విద్యావంతులు, ఉద్దాన పెద్దలు హాజరవ్వాలని కోరారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



భూమిపూజ నిర్వహిస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్

సోంపేట: గ్రామాలను అభివృద్ధి చేయడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. మండలంలోని కొర్లాం గ్రామంలో అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలోని కొత్త చెరువులో మెట్ల నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తామాడ మోహన్, దుమ్ము ఢిల్లీరావు, బత్తిన బాలరాజు, బంగారు పాపారావు, కోట్నీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా నిర్మాణాలు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని వైఎస్సార్, జగనన్న కాలనీల్లో వేగవంతంగా నిర్మాణాలు పూర్తిచేయాలని హౌసింగ్ డీఈ వి.రామకృష్ణ సూచించారు. స్థానిక పురుషోత్తపురం సచివాలయంలో జగనన్న కాలనీ నిర్మాణాలపై వలంటీర్లు, ఆర్పీలతో అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి త్వరితగతిన నిర్మాణాలు చేపట్టేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సోషల్ డవలప్‌మెంట్ స్పెషలిస్టు, హౌసింగ్ అధికారి సీహెచ్ మల్లేశ్వరరావు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మున్సిపల్ సమావేశం



సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపల్ సర్వసభ్య సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సమావేశం తూతూమంత్రంగా జరిగింది. కేవలం ముగ్గురు కౌన్సిర్లు తమ వార్డు సమస్యలపై చర్చ జరిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ విప్ దుర్గాశంకర్ పండా మాట్లాడుతూ మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. ఒకే వార్డులో పదుల సంఖ్యలో పనులు చేపట్టడం బాగులేదని, అన్నీ వార్డులకు ఎంతో కొంత నిధులు కేటాయిస్తే కౌన్సిలర్లు ఆనందిస్తారన్నారు. వేంకటేశ్వర కాలనీ, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు స్పందిస్తూ అంతరగుడ్డ ప్రాంతంలో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు వేయడానికి రూ.35 లక్షలు వెచ్చించడం జరిగిందన్నారు. ప్రతిపాదనలు వేయడంలో కొంచెం పొరపాటు జరగడం వల్లే నిధులు కేటాయించడం జరిగిందని సమాధానం ఇచ్చారు. కౌన్సిలర్ బోర చంద్రకళ మాట్లాడుతూ పలాసలో ఈనెల 11, 12, 13 తేదీల్లో గ్రామ దేవత ఉత్సవాలు జరగనున్నాయని, తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నెలలు గడుస్తున్నా పవర్ బోర్ పనులు ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. తక్షణమే తాగునీటి సమస్య పరిష్కారం చేయాలని కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు మీసాల సురేష్‌బాబు, బోర కృష్ణారావు, మున్సిపల్ డీఈఈ బల్ల హరి, మున్సిపల్ ఏఈఈ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

సంతకాలు ఫుల్.. కౌన్సిలర్లు నిల్

అయితే సమావేశానికి కౌన్సిలర్లు డుమ్మా కొట్టారు. సమావేశానికి వచ్చిన కౌన్సిలర్లు మినిట్ బుక్‌లో సంతకాలు చేసి వెనుదిరిగారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం, పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాలు, వసతులపై చర్చ జరగాల్సి ఉండగా ఈనెల మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు పూర్తి స్థాయిలో ఉండకపోవడంతో మమ అనిపించారు. వాస్తవానికి ఉదయం 11 గంటలకే సమావేశం ప్రారంభం కావాల్సిన ఉండగా, 15 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. అప్పటికి 31 మంది కౌన్సిలర్లు, ముగ్గురు కో-ఆప్షన్ సభ్యులు హాజరవ్వాల్సి ఉండగా, కేవలం 10 మంది కౌన్సిర్లుతో పాటు ఒక కో-ఆప్షన్ సభ్యుడు మాత్రమే ఉన్నారు. అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లతో పాటు టీడీపీ కౌన్సిలర్లు సమావేశం మినిట్ బుక్‌లో సంతకాలు చేసి వెనుదిరిగారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి
- బన్నువాడలో గడప గడపకూ మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న దువ్వాడ వాణి

టెక్కలి: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని బన్నువాడ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాల కోసం ఏ రాజకీయ నాయకుడి చుట్టూ తిరగకుండా నేరుగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందజేసేలా, దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన పాలన అందజేస్తున్నారని పేర్కొన్నారు. గత నాలుగేళ్ల పాలనలో బన్నువాడ గ్రామానికి సంక్షేమ పథకాల రూపంలో సుమారు రూ.4 కోట్లు అందజేశారని తెలియజేశారు. వీటితో పాటు హౌసింగ్ పథకంలో భాగంగా రూ.51 లక్షలు అందజేశారని వెల్లడించారు. అలాగే గ్రామంలో సీసీ రోడ్లు, నాడు-నేడు పథకంలో పాఠశాల అభివృద్ధి చేశారని వెల్లడించారు. అన్నివర్గాల ప్రజలకు మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సరోజనమ్మ, సర్పంచ్ పి.మోహన్‌రావు, వైస్ ఎంపీపీ ఎం.కిషోర్, నాయకులు పి.సోమేశ్వరరావు, ఎస్.కృష్ణారావు, బి.హరి, ఎస్.పుష్పలత, పి.శివ, జి.అశోక్, ఎస్.శేఖర్, పెద్దపు వాసు, జి.మోహన్‌రెడ్డి, ఎం.శంకర్, బి.రజని ఉదయ్, ఆర్.జయమోహన్, కె.కామేష్, పి.శ్రీనివాస్, హెచ్.వెంకటేశ్వరరావు, బి.డిల్లేశ్వరరావు, జి.జోగారావు, డి.కూర్మారావు, బి.ధనుంజయ్, జి.భాను, పి.సుధాకర్, బి.శ్రీను, ఎస్.రామిరెడ్డి, ఎ.రవి, బి.భుజంగరావు, ఎం.శివరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి



కోటబొమ్మాళి: జర్జంగి సచివాలయంలో వలంటీర్లను సత్కరిస్తున్న దృశ్యం



కోటబొమ్మాళి: సొడాం సచివాలయంలో వలంటీర్లకు సత్కారం



మందస: సిరిపురంలో వలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం

మందస: గ్రామ వలంటీర్లు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని సిరిపురం సర్పంచ్ హేమలత సాహు, పొత్తంగి మాజీ సర్పంచ్ దల్లి జానకిరావురెడ్డి అన్నారు. మండలంలోని సిరిపురంలో పొత్తంగి, సిరిపురం గ్రామ వలంటీర్లను బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సూర్యనారాయణ సాహు, కొల్లాన సోమేశ్వరరావు, వైస్ సర్పంచ్ దొళ బెహరా దొన్నమణి, నొట్టబొర మహంతి తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని జర్జంగి, కస్తూరిపాడు, దుప్పలపాడు, సొడాం సచివాలయాల పరిధిలోని వలంటీర్లను బుధవారం సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరమణారావు, ఎంపీటీసీ అన్నెపు రామారావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రోణంకి మల్లయ్య, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, సర్పంచ్‌లు పంగ చంద్రరావు, పి.వెంకటరావు, ఎస్.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

కవిటి: స్థానిక చంద్రశేఖర ఆలయం పునర్నిర్మాణానికి మేజర్ పంచాయతీ సర్పంచ్ పూడి లక్ష్మణరావు బుధవారం భూమిపూజ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దేవదాయ ధర్మాదాయ శాఖ సహకారంతో రూ.40 లక్షల సీజీఎఫ్ నిధులు మంజూరుతో ఆలయ పునర్నిర్మాణం చేపట్టడం శుభపరిణామమన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ చొరవతో సకాలంలో నిధులు మంజూరవ్వడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా విశ్వశాంతి మహాయజ్ఞం



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు

కవిటి: మండలంలోని జమేదారుపుట్టుగలో లోక కల్యాణార్థం విశ్వశాంతి మహాయజ్ఞాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రజలంతా ఆరోగ్యంతో ఉండాలని, వర్షాలు సక్రమంగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ ఒడిశాకు చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో యజ్ఞం చేపడుతున్నారు. బుధవారం ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు ఈ మహాయజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భారీ సంఖ్యలో హాజరైన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

కంచిలి ఎస్‌ఐగా బాలరాజు



కంచిలి: స్థానిక పోలీసుస్టేషన్ నూతన ఎస్‌ఐగా ఎస్.బాలరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇదివరకు సోంపేట ఎస్‌ఐగా విధులు నిర్వహించారు. ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహించిన చిరంజీవి బారువ పోలీసుస్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఆయనను సిబ్బంది సాదరంగా ఆహ్వానించారు.

‘ఇటుక బట్టీలతో అనారోగ్య సమస్యలు’

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, మండలం పరిధిలో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీల వలన ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, ఇటుక బట్టీల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంగి లక్ష్మి కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ గురుప్రసాద్‌కి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆమెతో పాటు అనపాణ కేశవరావు, ఉలాసి ఎర్రయ్య, తడక కాళిదాస్, బాబురావు, రఘునాథ్, నూకరాజు, మహదేవ్, డి.రవి తదితరులు ఉన్నారు.

చెరువుల లీజు వేలానికి ఆమోదం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: పురపాలక సంఘంలోని చెరువుల లీజు విషయమై మూడుసార్లు వాయిదా పడడంతో న్యాయపరమైన అంశాలపై మున్సిపల్ స్టాండింగ్ లాయర్ ఎస్.ఎల్.నారాయణ ఇచ్చిన సూచనల మేరకు, ఐదు చెరువులను బహిరంగ వేలం వేసేందుకు చేసిన తీర్మానాన్ని కౌన్సిల్ ఆమోదించింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 8 అంశాలతో కూడిన అజెండాపై చర్చించి, వాటన్నింటికీ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కౌన్సిల్ సభ్యులపై పురపాలక సంఘం అధికారులు గౌరవ, మర్యాదలతో నడుచుకోవాలని సిబ్బంది తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి అన్ని విభాగాలకు చెందిన అధికారులు హాజరవ్వకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాబాల స్వర్ణమణి, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వాణిజ్య బ్యాంకులకు దీటుగా సేవలు



మాట్లాడుతున్న చైర్మన్ రాఘవేంద్రరావు

కాశీబుగ్గ: దేశంలోని వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులు సేవలు అందిస్తున్నాయని ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. బుధవారం పలాస బ్రాంచి సభ్యుల మహాసభలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక సామరస్యానికి ఎటువంటి విఘాతం కలగకుండా, సహకార సిద్ధాంతాల నీడలో ప్రయాణం చేయగలిగితే ఉత్తమ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. సేవింగ్ ఖాతాల్లోని నిల్వలపై రోజువారి లెక్కింపు ప్రాతిపదికన 5 శాతం వడ్డీ చెల్లిస్తున్న బ్యాంకు కేవలం విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ మాత్రమేనన్నారు. తనఖా రుణాల వాయిదాలను సక్రమంగా చెల్లిస్తే చెల్లించిన వడ్డీతో 4 శాతం నగదు ప్రోత్సాహకంగా ఇస్తున్నామన్నారు. డైరెక్టర్ చెరువు ఆదినారాయణ శాస్త్రి అధ్యక్షతన జరిగిన సభలో బ్యాంక్ డైరెక్టర్ ఉప్పరపాటి పార్వతీదేవీ, కండాపు ప్రసాదరావు, రామకృష్ణ, జోనల్ మేనేజర్ రమణమూర్తి, పలాస బ్రాంచి మేనేజర్ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



టెక్కలి: శివదుర్గా మరకత లింగేశ్వర ఆలయ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీ వింజాంపాడు గ్రామంలో ఉమా సర్వేశ్వరస్వామి, షిర్డీసాయి ఆలయాలు, ఆదిత్య సమేత నవగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన విశ్రాంత లెక్చరర్ స్వర్గీయ చింతాడ చంద్రయ్య భార్య చింతాడ రవణమ్మ ఆధ్వర్యంలో గ్రామస్తుల భాగస్వామ్యంతో సుమారు రూ.1 కోటి నిధులతో ఆలయాల నిర్మాణాలు చేపట్టారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే దువ్వాడ శ్రీనివాస్, టెక్కలి వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, కేంద్ర మాజీమంత్రి కిల్లి కృపారాణి, జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రోణంకి మల్లయ్య, వైస్ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు, సర్పంచ్‌లు గురువెల్లి కేశవరావు, నూక సత్యరాజ్, బమ్మిడి గణపతిస్వామి, హెచ్.తేజ, హెచ్.శేషగిరిరావు, బగాది రామారావు తదితరులు హాజరయ్యారు.

టెక్కలి: స్థానిక భవానీనగర్‌లో శివదుర్గా మరకత లింగేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు వాకాడ శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన ఆలయంలో గత మూడు రోజులుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం శివదుర్గా విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించారు. కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి పాల్గొని పూజలు చేశారు.

అధికారులు కాదు అసిస్టెంట్లని గుర్తుంచుకోండి

- సచివాలయ ఉద్యోగులపై ఆర్డీవో ఆగ్రహం



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఆర్డీవో సీతారామమూర్తి తదితరులు

కాశీబుగ్గ: సచివాలయాల ఉద్యోగులు అధికారులు కాదని, అసిస్టెంట్లమని గుర్తుంచుకోవాలని పలాస ఆర్డీవో సీతారామమూర్తి హెచ్చరించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 11వ వార్డు పూజారివీధిలో ఉన్నటువంటి వార్డు సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి సచివాలయ ఉద్యోగులపై వస్తున్నటువంటి ఆరోపణలపై విచారించారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సక్రమంగా పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొంతమంది ప్రజలకు సేవలు అందించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడం సరికాదన్నారు. ప్రజలతో సక్రమంగా మెలగకుండా కొంతమంది ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరిస్తున్నారని, ఇకపై పద్ధతి మార్చుకోవాలని సూచించారు. స్పందనకు వచ్చే ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం చూపాలన్నారు. ఆయనతో పాటు మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, పలాస తహసీల్దారు మధుసూదనరావు, ఇన్‌చార్జి కమిషనర్ సీతారాం, ప్రభుత్వ విప్ శంకర్ పండా, కౌన్సిలర్ గుజ్జు జోగారావు, డబ్బీరు నాగు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు లక్ష్మణరావు(ఫైల్)

టెక్కలి రూరల్: మండలంలోని గంగాధరపేట గ్రామానికి చెందిన బమ్మిడి లక్ష్మణరావు (48) అనే వ్యక్తి ఆస్తి తగాదాల్లో భాగంగా, గత నెల 26వ తేదీన టెక్కలి చిన్నబజార్ సమీపంలోని తన పెద్దనాన్న కుమారుడి ఇంటి వద్ద పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకున్న విషయం తెలిసిందే. గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. మృతుడికి భార్య భాగ్యలక్ష్మి, కుమార్తె త్రిష ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

‘ప్రభుత్వం పునరాలోచన చేయాలి’

టెక్కలి: కొత్తగా విడుదలైన సినిమాలను మొదటి రోజు ఏపీ ఫైబర్ నెట్ ద్వారా ఇంట్లో వీక్షించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి చేసిన ప్రకటనపై పునరాలోచన చేయాలని టెక్కలి సుదర్శన్ థియేటర్ యజమాని సత్తారు వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే ఓటీటీ, ఇతర వెబ్‌సైట్ల వలన సినిమా థియేటర్లకు భారీగా నష్టం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఇటువంటి ప్రకటనతో మరికొంత ఆందోళన కలుగుతుందని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రాజేశ్వరి

టెక్కలి: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి అలికాన రాజేశ్వరి డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు బుధవారం టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి మండలాలకు చెందిన ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలని, పీఆర్‌సీ సమస్యలు పరిష్కరించాలని, సకాలంలో జీతాలు చెల్లించాలని, జీపీఎఫ్ తదితర సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం జిల్లా, టెక్కలి తాలూకా నాయకులు బి.సూర్యనారాయణ, ఎస్.వి.రమణ, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

‘క్రీడా పోటీలు స్నేహపూర్వకంగా ఉండాలి’



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న కృష్ణారావు

కంచిలి: స్నేహపూర్వకమైన వాతావరణంలో వివిధ ప్రాంతాల యువకుల మధ్య క్రీడాపోటీలు నిర్వహించాలని మండల వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి కృష్ణారావు సూచించారు. మండలంలోని జిల్లుండ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. టోర్నమెంట్ విజేతగా నిలిచిన కింగ్ కోబ్రా జట్టుకు రూ.3 వేలు, రన్నర్‌గా నిలిచిన గ్రీన్ ఎర్త్ జట్టుకు రూ.2 వేల నగదుతో పాటు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

నిరుపేదకు పెళ్లి కానుక



సరస్వతికి పెళ్లి కానుక అందజేస్తున్న దృశ్యం

కవిటి: మండలంలోని పెద్ద మెళియాపుట్టుగలో నిరుపేద కుటుంబానికి చెందిన సరస్వతి అనే యువతి వివాహానికి తమవంతుగా జైహింద్ ఫౌండేషన్ పెళ్లి కానుక ప్రకటించి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ మేరకు ఆ సంస్థ సభ్యులు పెళ్లి పీటలు ఎక్కనున్న సరస్వతికి ఫౌండేషన్ సంస్థ తరపున రెండు చీరలు, పసుపు కుంకుమతో పాటు రూ.11,111 నగదు బుధవారం అందజేశారు. చిన్నతనంలోనే ఆమె తల్లిదండ్రులను కోల్పోవడంతో ఫౌండేషన్ సభ్యులు అండగా నిలిచారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్, జైహింద్ ఫౌండేషన్ సభ్యులు వైకుంఠరావు, తాతయ్య, తలగాన నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కాళీమాత ఉత్సవాలు

మందస: మండలంలోని బాలిగాంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న కాళీమాత ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించడానికి వేలాది మంది తరలివచ్చారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కాళీమాతను దర్శించుకున్నారు. చివరి రోజున సిరిమానోత్సవం కనులపండువగా జరిగింది.



సిరిమానోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం